విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611, 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 244 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | మార్చి 2025 | వెల : రూ 10/-




## నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన బోర్డు
- మొత్తం 1,532 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- సిసి కెమరాలతో కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ
- నిమిషం నిబంధన ఎత్తివేత..5 నిముషాల వరకు అనుమతి

హైదరాబాద్, : తెలంగాణలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి,

-మిగతా 3 లో



## పులి పిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

పాలుపట్టి వాటితో ప్రేమ ప్రకటించిన మోడీ వంతారాలో పర్యటించి వివరాలు తెలుసుకున్న ప్రధాని

జామ్‌నగర్, పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు ,

-మిగతా 3 లో



## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

నోటీసులు జారీ చేసిన సుప్రీం ధర్మాసనం
విచారణ 25కు వాయిదా

న్యూఢిల్లీ, బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ సందర్భంగా ఫిరాయింపు

-మిగతా 3 లో



# బకాయిలు చెల్లించండి

- సీఎం ఆర్ డెలివరీ గడువు పొడిగించాలి
- కొత్త రేషన్ కార్డులు సన్న బియ్యం పైన చర్చ
- రెండురోజులుగా ఢిల్లీలోనే సీఎం, మిగిలిన మంత్రులు
- మిల్లింగ్ గడువు పెంచండి
- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ వినతి

న్యూఢిల్లీ (నేటి భారత్) ఎఫ్‌సీఐ 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పడిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

-మిగతా 3 లో



## శాసనసభకు కేసీఆర్ రాకపోవడంపై పిల్

పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు

హైదరాబాద్ ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరు కావడంపై పిల్ దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. శాసనసభ పరిధిలోని

-మిగతా 3 లో

## రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సుప్రీం ఆగ్రహం

- ప్రైవేట్ ఆస్పత్రులకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు
- బలవంతంగా మందులు అంటగడుతున్న ఆస్పత్రులు

న్యూఢిల్లీ, అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే.. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహకంగా మారిందని విమర్శించింది. ప్రైవేట్ ఆసుపత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో మందులు కొనుగోలు

-మిగతా 3 లో



# బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం



- ఆదిలాబాద్‌లోని సీసీసీని అమ్మేందుకు సిద్ధపడటం దుర్మార్గం
- నమ్మి ఓటేసినందుకు ఇదేనా మీరిచ్చే బహుమతి
- కార్మికుల ఆవేదన, అర్థనాదాలు విపిపించడం లేదా
- మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, బీజేపీని నమ్ముకుంటే చివరకు నడీరోడ్డుపై అమ్మేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీసీఐని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి, ఓట్లు, సీట్లు దండుకుని చివరికి స్క్రాప్ కింద అమ్మేస్తారా అంటూ నిలదీశారు. సీసీఐపైనే కోటి ఆశలు

-మిగతా 3 లో



## ఉక్రెయిన్ మిలటరీ సాయానికి ట్రంప్ బ్రేక్

జెలెన్‌స్కీతో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ పరిణామం చోటు

వాషింగ్టన్ ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న అన్ని రకాల మిలటరీ సాయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిలిపివేశారు. గత వారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. కాగా దీనిపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం వెంటనే స్పందించలేదు. "కేవలం శాంతిపైనే దృష్టి కేంద్రీకరించినట్టు అధ్యక్షుడు

-మిగతా 3 లో



## పర్యాటక రంగం అభివృద్ధికి ప్రాధాన్యం

- ఆదాయం రాని పీపీపీ ప్రాజెక్టులపై సమీక్షించండి
- ముందస్తు బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ రాష్ట్రంలో పర్యటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోం దని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి 2025- 26 వార్షిక సంవత్సరానికి సంబంధిం చిన ఎక్సైజ్, టూరిజం, కల్చర్, ఆర్కియాలజీ

-మిగతా 3 లో

# మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

**- ఉత్తర్వులు జారీ**

**- మార్చి 8న సీఎం ఆవిష్కరణ**



**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**

మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో 150 మండల సమాఖ్యలకు 150 ఆర్టీసీ అద్దె బస్సుల్ని ఇవ్వాలనీ, ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అద్దె బస్సులు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె రూపంలో ఆర్టీసీ రూ.77, 220 చెల్లిస్తుందని పేర్కొన్నారు. బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీ ఇస్తుంది. దేశంలో తొలిసారిగా మహిళా సంఘాలకు అద్దె బస్సుల్ని అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా 50 బస్సులను ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఒక్కో బస్సు విలువ రూ.36 లక్షలు ఉంటుందనీ, ఒక్కో మండల సమాఖ్యకు ఒక బస్సును కొనుగోలు చేసి ఆర్టీసికి అద్దె ఇస్తారని వివరించారు. తొలివిడతలో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల మహిళా సమాఖ్యలకు 150 అద్దె బస్సులను అప్పగించనున్నారు. ఈ బస్సులపై ఇందిరా మహిళా శక్తి ప్రధాన్యతను చాటి చెప్పేలా డిజైన్లు రూపొందించారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం**




**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**

మే 4వ తేదీన జరగనున్న జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో రాష్ట్రానికి మంచి ట్రాక్ రికార్డు ఉందనీ, మౌలిక సదుపాయాలు, తగిన భద్రతా ఏర్పాట్లు ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి నీట్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఆమె సమీక్షించారు. కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు వంటి ప్రభుత్వ భవనాలను వెంటనే గుర్తించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి**

భూ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) పురోగతిని కూడా సీఎస్ శాంతికుమారి సమీక్షించారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆమె ఆదేశించారు. ఈనెల 31 వరకు క్రమబద్ధీకరణ రుసుము చెల్లించిన దరఖాస్తులకు రిబేట్ (రాయితీ)పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో నామమాత్రపు ఫీజులు చెల్లించిన దరఖా స్తులపై ప్రత్యేక దృష్టి సారించి ఆ దరఖా స్తులను త్వరితగతిన పరిష్కరిం చాలని కోరారు. జిల్లా కలెక్టర్లు ఎప్పటి కప్పుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని కూడా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, లా అండ్ ఆర్డర్ ఏడీజీపీ మహేశ్ భగవత్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ నరసింహారెడ్డి, వైద్య విద్య సంచాలకులు నరేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతిలో మరోసారి చిరుత సంచారం కలకలం



**అమరావతి ప్రజా స్వేచ్ఛ**

తిరుపతిలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. అలిపిరి మెట్ల మార్గంలో గాలి గోపురం షాపుల దగ్గర తెల్లవారుజామున ఒంటి గంటకు చిరుత పులి కదలికలు కనిపించాయి. అక్కడే ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాల్లో చిరుత వెళ్తున్న దృశ్యాలు అందులో రికార్డు అయ్యాయి. దీంతో పోలీసులు.. వ్యాపారస్తులను, భక్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# ప్రభుత్వ భూముల అమ్మకానికి సర్కారు కుట్ర

**-నాడు సుద్దులు- నేడు టెండర్లు**

**- అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన వైనం : మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్**



**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**

ప్రభుత్వ భూముల అమ్మకానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా ప్రజలను తప్పుదోవ పట్టించిన సర్కార్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి. తెలంగాణ జాతి సంపద. ఆ భూములను అమ్మితే భవిష్యత్‌లో శ్మశానాలు నిర్మించాలంటే కూడా భూమి లేకుండా పోతుందని నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొసలి కన్నీరు కార్చిండు. తాము అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోమంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసిండు. ప్రస్తుతం రూ.20 వేల కోట్ల విలువైన భూములను వేలం వేసేందుకు తెరలేపిండు" అని హరీశ్‌రావు విమర్శలు గుప్పించారు. నిధుల సమీకరణ పేరుతో కారు చౌకగా భూములను అమ్ముతుండటం కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియామకానికి (ఆర్ఎఫ్‌పీ) గత నెల 28న టెండర్లు పిలవడం ప్రభుత్వ దిగజారుడు తనానికి పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. "కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25 పరిధిలోని 400 ఎకరాలను బ్యాంకర్లకు తనఖా పెట్టిన సమయంలో ప్రభుత్వం రూ. 25 కోట్లకు ఎకరం చొప్పున రూ.10వేల కోట్లు ఇప్పటికే సమీకరించింది. బ్యాంకులో తనఖా పెట్టిన అవే భూములనే వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు. "జూన్ 26, 2024న విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి రూ. 75 కోట్ల చొప్పున మొత్తం 30వేల కోట్ల విలువైన భూములను అమ్ముతున్నారని నేను అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టీజీఐఐసీకి చేస్తున్న భూ బదలాయింపు మాత్రమేనని బుకాయించారు. నిండు సభలో ముఖ్యమంత్రి సహా మంత్రులు తప్పుడు సమాధానం చెప్పి, సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారు. అసెంబ్లీ అయ్యిందో, లేదో వెంటనే అదే భూమిని తనఖా పెట్టి రూ. 10వేల కోట్ల రుణం తెచ్చుకున్నరు. తిరిగి అసెంబ్లీ మొదలయ్యే లోపే ఇప్పుడు అదే భూమి అమ్మకానికి టెండర్లు పిలుస్తున్నారు. భూముల అమ్మకంపై అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు. సర్కార్ భూముల అమ్మకం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలి" అని హరీశ్ డిమాండ్ చేశారు.

# సెర్బియా పార్లమెంట్‌లో గందరగోళం

**-పొగబాంబులు విసిరిన ప్రతిపక్షం**


**-ముగ్గురు ఎంపీలకు గాయాలు**




**బెల్గ్రేడ్ ప్రజా స్వేచ్ఛ**

సభలో పొగ బాంబులు విసరడంతో మంగళవారం సెర్బియా పార్లమెంట్‌లో గందరగోళ దృశ్యాలునెలకొన్నాయి. ఈ సందర్భంగా ముగ్గురు పార్లమెంట్ సభ్యులు గాయపడగా వారిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. విశ్వవిద్యాలయ విద్యకు నిధుల పెంపునకు ఉద్దేశించిన చట్టంపై ఓటింగ్ జరగాల్సి వుంది. కానీ ఈ సమావేశమే చట్ట విరుద్ధమైనదని వాదిస్తూ ప్రతిపక్ష పార్టీలు, ముందుగా ప్రధాని మిలోస్ వుసెవిక్ ఆయన ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. సమావేశం ప్రారంభమైన గంట తర్వాత పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. సెర్బియా ఎదుగుతోంది, పాలన క్షీణిస్తోంది అని రాసి వున్న బ్యానర్‌ను చేబూని, ఈలలు ఊదుతూ ప్రతిపక్ష సభ్యులు సభలో నినాదాలు చేశారు. దీంతో ఎంపీల మధ్య తొలుత ఘర్షణ మొదలైంది. ఆ వెంటనే పొగ బాంబులు విసురుకున్నారని బయటకు వచ్చిన వీడియోలను బట్టి తెలుస్తోంది. గ్రుడ్లు, నీళ్ళ సీసాలను కూడా ఒకరిపై ఒకరు విసురుకున్నారు. ఈ అల్లర్లలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ప్రతిపక్షం తీవ్రవాదులుగా వ్యవహరిస్తోందని పార్లమెంట్ స్పీకర్ అనా బ్రనబిక్ విమర్శించారు. ఈ సంఘటనతో దేశంలో రాజకీయ సంక్షోభం ఎంతలా నెలకొందో స్పష్టమవుతోంది. నెలల తరబడి కొనసాగుతున్న అవినీతి వ్యతిరేక నిరసనలతో ప్రభుత్వం అట్టుడికిపోతోంది. ఆందోళనలు ఉధృతం కావడంతో ప్రధాని వుసెవిక్ తన పదవికి జనవరిలో రాజీనామా చేశారు. పార్లమెంట్ ఇంకా దాన్ని ఆమోదించాల్సి వుంది.

# ఉత్తరాదిలో త్రిభాషా విధానం అమలవుతుందా?



**చెన్నై ప్రజా స్వేచ్ఛ**

దక్షిణాది రాష్ట్రాల్లోనే త్రిభాషా విధానం అమల్లో ఉంది. మరి ఉత్తరాది రాష్ట్రాల్లో త్రిభాషా విధానం అమలవుతుందా? అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈమేరకు ఆయన గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'దక్షిణ భారతీయులు హిందీ నేర్చుకునేలా దక్షిణ భారత హిందీ ప్రచార సభ (విద్యా సంస్థలు) ఏర్పాటు చేసి ఒక శతాబ్దం గడిచింది. ఇన్ని సంవత్సరాలలో ఉత్తర భారతదేశంలో ఎన్ని ఉత్తర భారత తమిళ ప్రచార సభలు స్థాపించబడ్డాయి? నిజానికి ఉత్తర భారతీయులు తమిళం లేదా ఏదైనా దక్షిణ భారతీయ భాషను సంరక్షించడానికి నేర్చుకోవాలని మేము ఎప్పుడూ డిమాండ్ చేయలేదు. మరి అలాంటిది.. మామీద త్రిభాషా విధానంతో హిందీ భాషను ఎందుకు బలవంతంగా రుద్దుతున్నారు? హిందీని రుద్దడం ఆపమనే మేము కోరేది. బిజెపి పాలిత రాష్ట్రాలు మూడు భాషల్ని లేదా.. 30 భాషల్ని బోధించాలనుకుంటే.. వాటికి అనుమతించండి. కానీ తమిళనాడుని మాత్రం వదిలేయండి' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

# సెబీ మాజీ చీఫ్‌కు ఊరట..



**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**

స్టాక్ మార్కెట్ మోసాల కేసులో సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌కు భారీ ఊరట లభించింది. మాధవి, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ముంబై ప్రత్యేక కోర్టు ఆదేశాలపై బాంబే హైకోర్టు స్టే విధించింది. స్టాక్ మార్కెట్ మోసాలు, నియంత్రణ సంబంధిత ఉల్లంఘనల ఆరోపణలపై మాధవి పురి బుచ్, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఏసీబీని ముంబై ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించించిన విషయం తెలిసిందే. దీనిపై మాధవి, హోల్ టైమ్ సభ్యులు అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్ష్నీ, బీఎస్ఈ చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సీఈవో సుందరరామన్ రామమూర్తిలు హైకోర్టులో వ్యక్తిగతంగా పిటిషన్లు దాఖలు చేశారు. వీరు దాఖలు చేసిన పిటిషన్లను బాంబే హైకోర్టు అత్యవసర విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్లపై ఇవాళ విచారణ జరిపింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను బాంబే హైకోర్టు నిలిపివేసింది

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి తరువాయి)

ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు పది లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. మొత్తం 1,532 కేంద్రాల్లో జరగనున్న పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. ఈసారి పరీక్షా కేంద్రాల గుర్తింపు కోసం హాల్ టిక్కెట్లపై క్యూర్ కోడ్‌లను సైతం ముద్రించటం విశేషం. ఇక పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరా సర్వైలెన్స్, పెద్ద సంఖ్యలో స్క్వాడ్ లను సైతం ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసిందని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు.. మార్చి 5వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే.. ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈసారి ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం లొకేషన్ సులువుగా తెలుసుకోవచ్చు.ప్రశ్నపత్రంపై సీరియల్ నెంబరు ముద్రిస్తున్నారు. దీంతో ఏ నెంబర్ ఉన్న పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో సులువుగా తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఈ పరీక్షల వేళ.. స్మార్ట్ వాచ్‌లతోపాటు అనలాగ్ వాచ్‌లను సైతం నిషేధిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సారి పరీక్షల వేళ.. చేతి గడియారాలనూ కూడా అనుమతించడం లేదు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించారు. మొత్తం 75 మంది సిబ్బంది.. ఈ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఈ హెల్ప్‌లైన్ నెంబరు 92402 05555 ను సంప్రదించవచ్చునని బోర్డు కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రారంభమైనాయి. మార్చి 1వ తేదీ నుంచి మొదటి సంవత్సరం, మార్చి 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనాయి.

# బకాయిలు చెల్లించండి

(మొదటి తరువాయి)

మంగళవారం కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బకాయిలు పెట్టి పదేండ్ల యిందని, వాటిని వెంటనే విడుదల చేయాల ని కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని, అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును నెలా నెలా కాకుండా కనీసం నాలుగు నెలలు పొడిగించాలని, అప్పుడే సరఫరాలో ఎటువం టి ఇబ్బందులు తలెత్తవని తెలియజేశారు.

**4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులు పునరుద్ధరించండి : సీఎం**

తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో మహిళా సంఘాలతో సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. వారి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం

(మొదటి తరువాయి)

పెట్టుకుని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? వారి ఆర్తనాదాలు వినిపించడం లేదా మండిపడ్డారు. ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవడం, సీసీఐ సంస్థ గొంతు కోయడమేనన్నారు. నిర్మాణ రంగంలో సిమెంటుకున్న డిమాండ్ దృష్ట్యా సీసీఐని ప్రారంభించి కార్మికులను కాపాడాలని బీఆర్ఎస్ పదుల సార్లు కేంద్రమంత్రులకు మొరపెట్టుకున్నా కనికరించకపోవడం ఆదిలాబాద్‌కు వెన్నుపోటు పొడవడమేనని చెప్పారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల్లో టౌన్ షిప్, 48 మిలియన్ లైమ్ స్టోన్ నిల్వలతో సకల వనరులున్న సంస్థను అంగడి సరుకుగా మార్చేసిన కేంద్రానికి ఉద్యోగులు, కార్మికుల గోస తగలక మానదన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.. సంస్థ పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రోత్సాహం అందించి వాటిని ఆదుకోవాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తున్నది. అస్మదీయులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతూ ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నది. కార్పొరేట్‌కు అప్పగించే పనుల్లో భాగంగా ఆదిలాబాద్ సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మూతబడిన సీసీఐ యంత్ర సామగ్రిని స్క్రాప్ కింద వేలం వేయడానికి టెండర్లను ఆహ్వానించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సిమెంటుకు డిమాండ్ భారీగా ఉంది. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అన్ని వనరులు ఉన్నాయి. సీసీఐని ప్రారంభిస్తే 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సీసీఐని ప్రారంభించాలని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పరిశ్రమ పునఃప్రారంభానికి రాయితీలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేలను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ, మోదీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా వేలాది మంది ఉపాధిని పట్టించుకోకుండా, స్థానికుల మనోభావాలను లెక్కచేయకుండా పరిశ్రమను కేంద్రం ప్రభుత్వం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రంలోని మోదీ సర్కారు ఈ పరిశ్రమను అమ్మేందుకు మూడేండ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నది. మొదటిసారి స్క్రాప్ ఈ-వేలంలో భాగంగా 2022 మే 5న ఆన్‌లైన్‌లో బిడ్లను ఆహ్వానించింది. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పట్లో వేలం ప్రక్రియ నిలిచిపోయింది. మరోసారి ఈ టెండర్లను కేంద్రం పిలిచింది. ఈ నెల 7 నుంచి టెండర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవచ్చని సూచించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమలో 71 పరికరాలకు సంబంధించి వేలం ప్రారంభ ధర రూ.43.30 కోట్లు ఉంటుందని అధికారులు తెలియజేశారు. దీంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పర్యాటక రంగం అభివృద్ధికి ప్రాధాన్యం

(మొదటి తరువాయి)

శాఖల ముందస్తు బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన టూరిజం పాలసీని తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న ఆలోచనకు అనుగుణంగానే బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాలని అధికారు లను ఆదేశించారు. టూరిజం ద్వారా ఆదాయం పెంచుకోవడానికి వనరులు సమృద్ధిగా ఉన్నాయనీ, వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి అధికా రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎకో, మెడికల్- వెల్‌నెస్, టెంపుల్, ఆధ్యాత్మిక టూరిజం అభివృద్ధి కోసం పర్యటక శాఖ రూపొందించిన ప్రతి పాదనలకు అనుగుణంగా బడ్జెట్లో తగిన ప్రాధా న్యతను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేట్, భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో టూరిజం ప్రాజెక్టులను చేపట్టడానికి రాష్ట్రంలో చాలా మంది ఆసక్తిగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే ఈ పద్ధతిలో నడుస్తున్న టూరిజం ప్రాజెక్టుల నుంచి రావాల్సిన ఆదాయం ప్రభుత్వానికి రాని యెడల వాటిని సమీక్షించాలని సూచించారు. ప్రాజెక్టుల వారీగా సమీక్షించి ప్రభుత్వానికి ఆదాయం తీసుకురావడానికి కావలసిన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ చుట్టూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి అటవీ, టూరిజం శాఖలు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వర్క్‌ఫ్రం హౌం పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను దృష్టిలో పెటుకుని కొత్త ప్రాజెక్టులను తీసుకురావాలని సూచించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న హరిత హౌటళ్ల నిర్వాహణ గురించి అడిగి తెలుసుకున్నారు. నష్టాల్లో నడుస్తున్న హౌటళ్ళను లాభాల బాటలోకి తీసుకురావడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ రామకృష్ణారావు, టూరిజం ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, కమర్షియల్ టాక్స్ కమిషనర్ సయ్యద్‌అలీ ముర్తుజా రిజ్వీ, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ టూరిజం డైరెక్టర్ హనుమంతు జెండగే తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటి తరువాయి)

ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారో స్పీకర్‌తో సంప్రదించి వివరాలు అందించాలని ధర్మాసనం ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ఇప్పటి వరకు తమకు ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22లోపు నోటీసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ మాహిస్ జార్జ్‌ల ధర్మాసనం మార్చి 25కి వాయిదా వేసింది

# పులి పిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

(మొదటి తరువాయి)

జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించారు. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. మంగళవారం జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉద్యోగులు కూడా పనిచేస్తున్నారు.

# శాసనసభకు కేసీఆర్ రాకపోవడంపై పిల్

(మొదటి తరువాయి)

అంశంపై పిల్ ఎలా వేస్తారని ప్రశ్నించింది. ఈ విషయంలో కోర్టులు ఎలా జోక్యం చేసుకోగలవని పిటిషనర్‌ను ప్రశ్నించింది. వివరణ ఇచ్చేందుకు పిటిషనర్ లాయర్ గడువు కోరడంతో విచారణ ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసింది. కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యేందుకు చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి.విజరుపాల్‌రెడ్డి వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజరుపాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన డివిజన్‌బెంచ్ మంగళవారం విచారించింది. పిటిషనర్ గడువు కోరడంతో విచారణ వచ్చే నెల రెండో వారానికి వాయిదా వేసింది.

# రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సుప్రీం ఆగ్రహం

(మొదటి తరువాయి)

చేయిస్తున్నాయంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. తమ ఫార్మసీల నుంచి మందులు కొనుగోలు చేయాలంటూ.. రోగులను బలవంతం చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. దీంతో రోగులు దోపిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అయితే పిటిషనర్ వాదనతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే ఫార్మసీలో స్వల్ప ధరకు లభ్యమవుతుంటే.. దానిని తమ ఫార్మసీలోనే కొనుగోలు చేయాలంటూ ప్రైవేట్ ఆసుపత్రులు రోగులపై ఒత్తిడి తీసుకు రాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార మందులు అందుబాటు ధరల్లో లభించడం కష్టమై పోయిందంటూ వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడికి గురి కాకుండా రక్షించేందుకు తగిన మార్గ దర్శకాలను రూపొందించాలంటూ కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# ఉక్రెయిన్ మిలటరీ సాయానికి ట్రంప్ బ్రేక్

(మొదటి తరువాయి)

స్పష్టం చేశారు. మన భాగస్వాములు కూడా ఈ లక్ష్యానికి కట్టుబడి వుండాల్సి వుంది. ఒక పరిష్కార మార్గానికి దోహదపడేలా ప్రస్తుతానికి మనమందించే సాయాన్ని నిలిపివేస్తూ,ఈ మొత్తం వ్యవహారంపై సమీక్ష జరుపుతున్నాం." అని వైట్‌హౌస్ అధికారి ఒకరు వెల్లడించారు. యుద్ధం ముగిసే సమయం ఇంకా చాలా చాలా దూరంలో వుంది అంటూ జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ట్రంప్, గతంలో అమెరికా అందించిన తోడ్పాటును ఉక్రెయిన్ కలకాలం గుర్తుంచుకోవాలని పునరుద్ఘాటించారు. 'జెలెన్‌స్కీ చేసిన అత్యంత అధ్వాన్నమైన ప్రకటన ఇది. అమెరికా దీర్ఘకాలం దీన్ని సహించలేదు.' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో కుదుర్చుకోవాలనుకున్న ఖనిజాల ఒప్పందం కథ ఇక ముగిసినట్లేనని భావిస్తున్నారా అని ప్రశ్నించగా అలా అనుకోవడం లేదని ట్రంప్ బదులిచ్చారు.

# సంపాదకీయం

## హిందీ ఆధిపత్యం దేశ భవితవ్యానికి చేటు

బహుశా, ఒక ముఖ్యమంత్రి రాసిన చాలా అసాధారణ లేఖ అది. సమస్త భారతీయులను ఉద్దేశించి రాసిన బహిరంగ లేఖ అది. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఆ లేఖకు వెన్వెంటనే వేలాది ప్రతిస్పందనలు వచ్చాయి. ఆ లేఖ రాసింది తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.కె.స్టాలిన్. 'ఇతర రాష్ట్రాలకు చెందిన నా ప్రియమైన సోదరీ సోదరుల్లారా' అంటూ ప్రారంభమైన ఆ లేఖ ఇలా కొనసాగింది: ఎన్ని ఇతర భారతీయ భాషలను హిందీ ఇప్పటివరకు కబళించిందో తెలిస్తే మీరు ఆశ్చర్యపోరూ? భోజ్‌పురి, మైథిలి, గఢ్వాలి, అవధి, బ్రజ్, కుమౌనితో సహా 19 భాషలు మాయమైపోయాయి. ఇంకా మరిన్ని భాషలు అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఆరాటపడుతున్నాయి. ఏకరూప హిందీకి గుర్తింపు తీసుకువచ్చేందుకు చూపుతున్న పట్టుదల పురాతన మాతృభాషలను హరించివేసింది ఉత్తరప్రదేశ్, బిహార్‌లు హిందీ భాష మాట్లాడే ప్రాంతాల నడిబొడ్డు రాష్ట్రాలు కానేకావు. ఆ రాష్ట్రాల ప్రజానీకం అసలు భాషలు ఇప్పుడు గతకాలం అవశేషాలు. చరిత్ర గురించిన అవగాహన ఉన్నవారికి ఇదంతా ఎక్కడకు దారితీస్తుందో తెలుసు. అవును ఇది ఎక్కడ ముగుస్తుందో మాకు తెలుసు కనుకనే హిందీ ప్రాబల్యాన్ని తమిళనాడు ప్రతిఘటిస్తోంది'. ఏకరూప హిందీకి గుర్తింపునకు వ్యతిరేకంగా స్టాలిన్ ఆక్షేపిస్తున్న సమయంలోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెన్నైలో ఉన్నారు. ప్రణాళికా బద్ధంగా నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తమిళనాడు ఒక్క పార్లమెంటరీ స్థానాన్ని కోల్పోకుండా ఉండేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాగ్రత్త వహిస్తారని రాష్ట్ర ప్రజలకు అమిత్ షా హామీ ఇచ్చారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తమిళనాడుకు కేటాయించే సీట్ల సంఖ్య తగ్గదనే విషయమై అమిత్ షా ఎటువంటి హామీ ఇవ్వలేదు. ప్రస్తుత సీట్ల సంఖ్య కేటాయింపు జరిగినప్పుడు భారతదేశ జనాభా వృద్ధి రేట్లు భిన్నంగా ఉన్నాయి. ఉత్తర భారతావని రాష్ట్రాలలో జనాభా పెరుగుదల చాలా హెచ్చు స్థాయిలో ఉన్నది. తత్కారణంగా ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు ఒక నియోజక వర్గంలో 30 లక్షల మంది జనాభా ఉండగా తమిళనాడులో ఆ సంఖ్య ఇంచుమించు 18లక్షలుగా ఉన్నది. జనాభా సంఖ్య ఆధారంగా కొత్త లోక్‌సభ సీట్లు నిర్ణయించడం జరిగితే తమిళనాడు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గిపోయే అవకాశమున్నది. ఉత్తరప్రదేశ్‌లో వాటి సంఖ్య పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం లోక్‌సభలో సీట్ల సంఖ్య 753కు పెరిగితే ఇప్పటికే అత్యధిక ఎంపీలను పంపుతున్న ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాల సంఖ్య 80 నుంచి 128కి పెరిగే అవకాశం తప్పకుండా ఉన్నది.

దీనివల్ల ఉత్తర దక్షిణ భారతదేశాల మధ్య రాజకీయ సమతౌల్యతకు వాటిల్లేదేమిటో స్పష్టమే. హిందీ భాష మాట్లాడే ప్రాంతాల నడిబొడ్డు రాష్ట్రాలలో దక్షిణాది రాష్ట్రాలలో కంటే లోక్‌సభ సీట్ల సంఖ్య పెరుగుతుంది.. దీని పర్యవసానమేమిటంటే జాతీయ రాజకీయాలపై ఉత్తరాది ప్రాబల్యం బాగా పెరిగిపోతుంది. హిందీ రాష్ట్రాలను పరిపాలించే రాజకీయ పక్షాలే జాతీయ రాజకీయాలలో ప్రాధాన్యం పొందుతాయి. జాతీయ రాజకీయాలలో దక్షిణాది రాష్ట్రాల ప్రభావ ప్రాబల్యాలు గణనీయంగా తగ్గిపోతాయి. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతౌల్యత ఇలా తలకిందులు కావడం సరికాని ఆలోచనగా భారతీయ జనతా పార్టీ భావించడం లేదు. ఉత్తర భారతావనిలో లోక్‌సభ సీట్ల సంఖ్య పెరుగుదల ఏ స్థాయిలో ఉన్నా బాగా లబ్ధి పొందేది బీజేపీనే. దేశ రాజకీయాలపై తిరుగులేని పట్టుకు హిందీ రాష్ట్రాలలో ఆధిక్యత ఆ పార్టీకి ఎంతైనా అవసరం. అందుకు ఆ పార్టీకి లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన తోడ్పడనున్నది. ఈ కారణంగానే స్టాలిన్, ఇతర దక్షిణాది నాయకులు హిందీ ప్రాబల్యం, జాతీయ రాజకీయాలలో ఉత్తరాది పెత్తనం విషయమై అమితంగా కలవరపడుతున్నారు. సకల రంగాలలో విజయాల మీద విజయాలు సాధిస్తూ పురోగమిస్తున్న కారణంగా దక్షిణాది రాష్ట్రాలను నియోజకవర్గాల పునర్విభజన తదితర చర్యలతో శిక్షిస్తున్నారని స్టాలిన్, ఇతర దక్షిణాది నాయకులు వాదిస్తున్నారు. నిజమే. ఆర్థికాభివృద్ధిలో దక్షిణ భారతావని ఉత్తర భారత రాష్ట్రాల కంటే బాగా ముందంజలో ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో అక్షరాస్యత రేటు 68శాతం కాగా కేరళలో అది 94శాతంగా ఉన్నది. ఆర్థికాభివృద్ధిలోనూ ఆ రెండు రాష్ట్రాల మధ్య ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. చాలా సంవత్సరాల క్రితం, సామాజిక మాధ్యమాలు రంగంలోకి రాక ముందు దక్షిణాది రాష్ట్రాల వృద్ధిరేట్లను టీవీ మోహన్ దాస్ పాయ్ గణించారు. ఆ వృద్ధి రేట్లు ఆసియన్ టైగర్స్‌గా సుప్రసిద్ధమైన సింగపూర్, దక్షిణ కొరియా మొదలైన ఆగ్నేయాసియా దేశాల వృద్ధిరేట్లతో సమానస్థాయిలో ఉన్నాయి. జనాభా పెరుగుదల విషయంలోనూ ఇటువంటి వ్యత్యాసమున్నది. ఉత్తరాది, దక్షిణాది లోక్‌సభ నియోజకవర్గాల పరిమాణాలలో వ్యత్యాసానికి ప్రధాన కారణం జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు సంపూర్ణ ఫలితాలు సాధించడమే అన్నది స్పష్టం. హిందీయేతర రాష్ట్రాలలో ఇప్పుడు జనాభా రేట్లు, మరణాల రేట్ల కంటే తక్కువగా ఉన్నాయి. 1960, 70ల్లో అనియంత్రిత జనాభా పెరుగుదల విషయమై వ్యక్తమైన భయాందోళనలు నిరాధారమైనవని రుజువయింది. ఇందుకు ప్రధాన కారణం హిందీ భాషా యేతర రాష్ట్రాలు జనాభా నియంత్రణలో సంపూర్ణంగా విజయవంతమవడమేనని చెప్పక తప్పదు చాలా మంది దక్షిణ భారతీయులు భావిస్తున్న, అయితే తప్పనిసరిగా బయటకు చెప్పని విషయాలనే స్టాలిన్ బహిరంగ లేఖ వ్యక్తం చేసింది. హిందీ రాష్ట్రాల వైఫల్యాల కారణంగా దక్షిణాది రాష్ట్రాలు మరింతగా ముందుకు సాగకుండా ఎంతకాలం నిలువరిస్తారు? భారతదేశ రాజకీయాలపై అన్నిటా వెనుకబడిన రాష్ట్రాలే ప్రభావ ప్రాబల్యాలు నెరపేందుకు అవకాశం కల్పిచడం దేశ శ్రేయస్సుకు మేలు చేస్తుందా? మనది ప్రజాస్వామిక సమాజం మాత్రమే కాకుండా ఒక సమాఖ్య పాలనా వ్యవస్థ కూడా. దేశం మరింతగా పురోగమించాలంటే రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. దేశాన్ని ప్రగతిపథంలో నిరంతరం ముందుకు తీసుకు వెళుతున్న రాష్ట్రాలను స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం శిక్షించడం దేశానికి ఏ విధంగా మేలు చేస్తుంది? దక్షిణ భారతదేశ ప్రజల మనస్సుల్లో సుడులు తిరుగుతున్న ప్రశ్నలివి. ఇటువంటి నిరసన భావాల నుంచే హిందీ భాషపై మళ్లీ చర్చ ప్రారంభమయింది. దేశ ప్రజలకు స్టాలిన్ బహిరంగ లేఖే అందుకు తార్కాణం.

# విస్తరణ దిశగా బిజెపి అడుగులు !

మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో ఘనవిజయం తరవాత బిజెపి ఏ మాత్రం తగ్గడంలేదు. ఢిల్లీ గెలుపును ఆకాశమంత చేసి ప్రచారం చేసుకున్నారు. ఢిల్లీ ఎన్నికలకు ముందే జరిగిన వరుస ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా రావడంతో ఇక బిజెపి మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. జమిలి ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం జరుగుతున్న వేళ బీజేపీ సత్తా చాటి తనకు తిరుగులేదన్న సంకేతాలు ఇచ్చింది. బీహార్‌లోనూ సొంతంగా పాగా వేసేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. బెంగాల్లో మరోమారు తమవంతుగా ప్రయత్నాలు చేపట్టారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు బిజెపికి అత్యంత ముఖ్యం. ఓ రకంగా చెప్పాలంటే బిజెపి ఎత్తుల ముందు కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేక పోతోంది. అంబేద్కర్, రాజ్యాంగం పేరుతో కాంగ్రెస్ ఎంత రచ్చ చేసినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. అలాగే బిజెపి ఎత్తులన్నీ కాంగ్రెస్‌ను పెద్ద దెబ్బకొట్టేలా ఉంటాయి. ఇవేవీ పెద్దగా ప్రభావం చూపవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు కొట్టి పారేసినా.. ప్రజల్లో నాటుకున్న భావనలను మాత్రం తోసిపుచ్చలేం. బీజేపీ కూటమి వరుస విజయాలు బిజెపిని తిన్నగా కూర్చోనివ్వడం లేదు. అందుకే దక్షిణాదిలో పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. తమిళనాడు, కేరళలో త్వరలో ఎన్నికలు రానున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే బీజేపీతో చేతులు కలిపేందుకు ఆయా రాష్ట్రాల్లో చిన్నాచితక పార్టీలు క్యూ కడుతున్నాయి. ఢిల్లీ విజయం బీజేపీకి జాతీయ స్థాయిలో మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే రేపు జరగగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికలకు కూడా బూస్ట్ కానుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో మున్ముందు మేలు చేస్తుందనే భావన ఉంది. ఈశాన్య రాష్ట్రాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోయినా.. దేశంలో అంతటా బిజెపికి బలం ఉందని చెప్పుకోవడానికి పనికి వస్తుంది. చిన్న రాష్ట్రాలనైనా గుప్పిట పెట్టుకోవాల్సిందే అన్నది బిజెపి రాజకీయం. దేశ రాజకీయాలు ప్రధానంగా ఉత్తర భారతదేశం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. కాబట్టే ఇటు ఈశాన్య రాష్ట్రాలను జాతీయ పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. అక్కడ లోక్‌సభ స్థానాలు కూడా చాలా తక్కువ కావడం అందుకు మరో కారణం. కానీ బిజెపి వచ్చాక ఈ చిన్న రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పాగా వేయాలన్న పట్టుదలతో ఉంది. అందుకే తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎపిలోనూ పాగా వేయకున్నా బలపడాలన్న పట్టుదలతో ఉంది. అందుకే టిడిపితో కలిసి అధికారం పంచుకుంది. పవన్ కళ్యాణ్ ఇప్పుడు దక్షిణాదిలో బిజెపికి తురుపు ముక్క కానున్నారు. ఆయన సనాతన ధర్మం పేరుతో చేస్తున్న యాత్రలకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుత



సమీకరణాలను మాత్రం బిజెపి బాగా అధ్యయనం చేయడం ద్వారా రానున్న ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. వీటన్నింటిపై అమిత్ షా బీజేపీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అగ్రనాయకత్వాలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు. ఇలా ప్రతి అంశంపై చర్చించిన బీజేపీ పెద్దలు మార్గనిర్దేశనం చేయబోతున్నట్లు సమాచారం. అమిత్ షా రాష్ట్ర రాజకీయాల్లో తరచూ జోక్యం చేసుకుని ఎలా ముందుకు వెళ్లాలో సూచిస్తున్నారు. విచిత్రమేమంటే ఏడు దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ అనుసరించిన సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్రమోద, అమిత్ షాలు అమలు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పార్టీల్లో సీనియర్లను పక్కన పెట్టడం, ముఖ్యమంత్రులను మార్చడం తదితర నిర్ణయాలన్నీ గతంలో కాంగ్రెస్ చేసి చూపింది. బిజెపి రాజకీయాల తీరు కాంగ్రెస్ సంస్కృతికి ఏ మాత్రం భిన్నంగా లేవనడానికి అనేక నిర్ణయాలు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ మొత్తం వ్యవహారంలో అధికారమే లక్ష్యంగా మోడీ ద్వయం అడుగులు వేస్తోంది. మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మ ప్రధానమంత్రిగా అభివర్ణించిన వారే మోడీ హయాంలో ఇప్పుడంతా కీలుబొమ్మలుగా మారారు. మోదీ హయాంలో బిజెపి కూడా కాంగ్రెస్ మాదిరే అధిష్ఠానవర్గాన్ని అత్యంత బలోపేతంగా మార్చి ప్రజలు, వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అభిప్రాయానికి విలువలేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నది. మోదీ హవా కూడా ఆయన ఆకర్షణ ఓట్లు తేగలిగినంత కాలమే సాగుతుంది. స్థానికంగా బలహీనులైన, కీలుబొమ్మలైన నేతలను ప్రోత్సహిస్తే కేంద్రం బలహీనపడ్డప్పుడు తదనుగుణంగా రాష్ట్రాల స్థాయిలో కూడా బిజెపి కుప్పకూలిపోతుంది. అయితే ఇకముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్న దానిపైనే భవిష్యత్ రాజకీయం ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు బిజెపి అధ్యక్షపదవికి ఎన్నిక జరగాల్సి ఉంది. బలమైన నేతకోసం గాలిస్తున్నారు. పార్టీని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకుని వెళ్లగలిగే నేతకావాలి. దక్షిణాదికి చెందిన నేతల్లో ఒకరిని కూడా పరిశీంచే అవకాశం ఉంది. నిజానికి వెంకయ్యనాయుడు లాంటివారు పార్టీలో ఉండివుంటే అధ్యక్షపదవికి అవకాశం ఉండేది. దక్షిణాదిలో అలాంటి నేతలు లేరనే చెప్పాలి. తెలంగాణలో కూడా సమర్థుడైన, బలమైననేతను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాల్సి ఉంది. నిజానికి బిజెపి ఇప్పుడు మైనార్టీలో ఉంది. ముందుగా మెజార్టీ సాధించే ప్రయత్నాలు చేయడానికి మోడీద్వయం ఆలోచనచేస్తూ ఉంటుంది. ఎన్‌డిఎగా ఉన్నప్పటికీ సొంత బలం కోసమే బిజెపి ప్రయత్నాలు చేస్తుంది. అది కూడా ఈ యేడు మొదలు పెట్టినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీని బలోపేతం చేయడం, అన్ని రాష్ట్రాల్లో అధికారం దక్కించు కోవడమే బిజెపి ముందున్న ప్రధాన లక్ష్యంగా చూడాలి. బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న పార్టీలు ఒక్క తాటిపైకి రావడానికి కసరత్తు కూడా పెద్దగా జరగడం లేదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న పార్టీలన్నీ కూడా అవకాశం కోసం చూస్తున్నాయి. ఇప్పటికే బిఆర్ఎస్, టీఎంసీ,డీఎంకే,ఎన్సీపీ, శివసేన ,ఎస్పీ, ఆర్జేడీ పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నాయి. హిందీ వ్యతిరేకతతో తమిళనాడు సిఎం స్టాలిన్ తన స్థానం పదిలం చేసుకునే పనిలో ఉన్నారు. బిజెపిని నిలువరించాలని అనుకుంటున్న శక్తులను కూడగట్టాలని చూస్తున్నా.. ఎవరికి కాలం కలసి రావడం లేదు. అన్ని ప్రాంతీయ పార్టీలు జట్టుగా బీజేపీపై రాజకీయ పోరాటం కోసం ఎజెండా సిద్ధం చేసే కసరత్తు చేస్తే తప్ప ఫలితం ఉండదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుపై మరింత వేగం పెంచే అవకాశం కోసం చూస్తున్నాయి. అయతే అది సాధ్యం కాదని ఇప్పటికే తేలింది.

# 'పరీక్షా' కాలం

సాధారణంగా మార్చి అనగానే మనకు గుర్తొచ్చేది వేసవికాలం. విద్యార్థులకు మాత్రం 'పరీక్షా' కాలం. నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈనెల ఇరవైఐదు వరకు కొనసాగుతాయి. ఈ పరీక్షలు నడుస్తుండగానే ఇరవై ఒకటి నుంచి ఎస్సెస్సీ ఎగ్జామ్స్ స్టార్ట్ అవుతాయి. ఇవి ఏప్రిల్ నాలుగుతో ముగుస్తాయి. పరీక్షలనగానే విద్యార్థులను సహజంగానే ఒక భయం వెంటాడుతుంది. అనవసరపు ఆందోళన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారితీస్తుంది. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురికావడం సాధారణం. ప్రతికూల ఒత్తిడి పెరిగిన విద్యార్థుల్లో ఏకాగ్రత సడలడం, టెన్షన్ పెరగడం, అనుకున్న స్థాయిలో రాణించకపోవడం జరిగేదే. అంతమాత్రాన జీవితమంతా ఏదో అయిపోయిందనే భ్రమలో వారిని ముంచకూడదు. దీంతో పరీక్షలు సరిగా రాయనివారు, ఫెయిల్ అవుతామేమోనన్న ఆందోళనలో ఉన్నవారు మరింత కుంగుబాటుకు లోనవుతారు. అలాంటి పరిస్థితి రాకుండా చూడాలి.

నేడు విద్యార్థులు చిన్నచిన్న కారణాలకే దారుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరీక్షలు తప్పుతామేమోనని, లేదంటే ఫెయిల య్యామని క్షణికావేశానికి లోనై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఎన్నో ఆశలతో కనిపెంచిన తల్లిదండ్రులకు కడుపుకోతను మిగులుస్తున్నారు. గతేడాది ఇంటర్ ఫెయిలయ్యామని ఎనిమిది మంది విద్యార్థులు



ఆత్మహత్యలకు పాల్పడ్డారు. హాస్టల్ బాత్రూం గదిలో ఉరేసుకుని, రైలుపట్టాలపై పడి, గడ్డి మందుతాగి, సూసైడ్ నోట్‌రాసి ఇలా అర్ధాంతరంగా తనువులు చాలించారు. ఇది అత్యంత బాధాకరం. ఈ చావులన్నింటికీ మూలాన్ని పరిశీలిస్తే మానసిక ఒత్తిడి ఒకటైతే, తల్లిదండ్రులు ఏమంటారోనన్న భయం, యాజమాన్యాల వేధింపులు మరోటి. పోయిన సంవత్సరం అనుశ్రీ అనే విద్యార్థి ఇంగ్లీష్ రావడం లేదని సూసైడ్ చేసుకుని తల్లిదండ్రులకు తీరనివేదన మిగిల్చింది. ఇంగ్లీష్ అనేదే జీవితమా? అది లేకుంటే బతకలేమా? తెలుగులో చదువుకున్న వారికి ఉద్యోగాలు రావా, లేవా? మిమ్మల్ని పెంచిపెద్ద చేసిన తల్లిదండ్రులకు ఎందుకీ శోకం? ఒక్కసారైనా వారి స్థానంలో ఉండి ఆలోచించారా? శివ కుమార్ అనే విద్యార్థి కూడా 'క్షమించండి నాన్న. మీరు నాకోసం ఎన్నో చేశారు. కానీ నేను పరీక్షకు హాజరు కాలేకపోయాను' అని సూసైడ్‌నోట్ రాసి కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎందుకీ అఘాయిత్యం? కారణాలేవైనా ఉండొచ్చు. పరీక్షకు హాజరు కాకపోవడం చనిపోయేంత పెద్దతప్పా? సప్లిమెంటరీ రాసుకోవచ్చు, లేదంటే మరో ఏడాది అను కున్న ఫలితాలు సాధించవచ్చు. రెండు పదులు కూడా నిండని వయసు, అప్పుడే జీవితం అయిపోదు కదా.

లక్ష్యసాధనలో కొందరు తొందరగా, మరికొందరు ఆలస్యంగా చేరుకుంటారు. అంతమాత్రనా తమ జీవితమే వ్యర్థమనే స్థాయికి రావడం, ఆలా ఆలోచించడం, కొత్తదారుల్ని అన్వేషించకపోవడమే. 'ఏది తనంతట తన దరికి రాదు, శోధించి సాధించాలి' అంటారు శ్రీశ్రీ. మనిషి జీవితంలో ముఖ్యమైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు సరైనమార్గాన్ని ఎంచుకోవడం కీలకం. చక్కని ప్రణాళికతో పాటు ఒత్తిడికి అధిగమించడం ప్రధానం. మరో అంశం విద్యార్థులను ప్రోత్సహించడం. ఇది ఉపాధ్యాయ, అధ్యాపకుల కర్తవ్యం. ఎందుకంటే, ఇటీవల వికారాబాద్‌లో జరిగిన ఓ ఘటన టీచర్ల బాధ్యతారహిత్యాన్ని బహిర్గతపరిచింది. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన టెన్త్‌క్లాస్ ఫేర్‌వెల్ పార్టీలో పెద్దయ్యాక ఏమవుదామనుకుంటున్నావు? అని ఓ బాలికను టీచర్ ప్రశ్నించగా వెటర్నరీ డాక్టర్‌ను అవుతానని బదులిచ్చింది. 'నీ ముఖానికి డాక్టర్‌వు అవుతావా? మెడికల్ షాపు పెట్టుకుని బతుకు' అని చిన్నతనంగా మాట్లాడటంతో బాలిక స్కూల్ బిల్డింగ్‌పై నుంచి దూకగా కాలు విరిగింది. దీనికి బాధ్యతెవరిది? సమాజాన్ని ప్రభావితం చేసే వృత్తిలో ఉండి ఇలా అవమానించడం సహేతుకం అనిపించుకోదు.

# తెలుగు రాష్ట్రాలకు గుడ్‌న్యూస్.. అభయారణ్యంలో ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ ......

తెలుగు రాష్ట్రాల మధ్య హైదరాబాద్-శ్రీశైలం-నంద్యాల ప్రాంతాలకు ప్రయాణించేవారికి గుడ్‌న్యూస్. ఈ మార్గంలో కొత్తగా ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి రానుంది. ఈ కారిడార్ పూర్తయితే.. తెలంగాణ-ఏపీ మధ్య ప్రయాణం 45 నిమిషాలు తగ్గుతుంది. ఈ ప్రాజెక్ట్ డీటెయిల్స్ ఏంటి..? ఎంత ఖర్చవుతుంది..? ఆసక్తికర విషయాలను తెలుసుకోండి..తెలుగు రాష్ట్రాల మధ్య హైదరాబాద్-విజయవాడ హైవే తర్వాత ఎక్కువగా హైదరాబాద్-శ్రీశైలం హైవేపై రాకపోకలు సాగిస్తుంటారు. రాయలసీమ ప్రాంతానికి వెళ్లేవారితో పాటుగా.. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లేవారు ఈ హైవే పైనే వెళ్తుంటారు. ఈ రహదారిపై పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ మార్గాన్ని విస్తరించేందుకు డిసైడ్ అయ్యారు. 125 కిలోమీటర్ల పొడవుతో ఉన్న ఈ జాతీయ రహదారి.. నల్లమల ఫారెస్ట్ అమ్రాబాద్ పులుల అభయారణ్యం మీదుగా వెళ్లనుంది. ఇందులో 62 కిలోమీటర్ల దూరం రెండు లేన్ల ఘాట్లతో ఇరుకుగా ఉంది. దీంతో ప్రస్తుతం వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవతున్నాయి. ఈ ప్రాంతంలో టర్నింగ్‌ల కారణంగా.. వన్యప్రాణులు కూడా యాక్సిడెంట్ బారిన పడుతున్నాయి. దానికి తోడు హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి దూరం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టారు. ఈ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ ఎగ్జామ్స్.. 5 నిమిషాలు లేటైనా ఓకే..!!




**-నిర్ణీత టైమ్కు ఆలస్యమైనా సెంటర్లోకి అనుమతి**

**-1,532 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 9,96,971 మంది**

**-ప్రతి సెంటర్లో సీసీ కెమెరాల ఏర్పాటు**

**-వివరాలు వెల్లడించిన ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య**

ప్రజా స్వేచ్ఛ....

హైదరాబాద్ రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఈ నేపథ్యంలో స్టూడెంట్స్కు 5 నిమిషాల గ్రేస్ టైమ్ ఇస్తున్నామని, పరీక్షల నిర్ణీత సమయానికి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా సెంటర్లోకి అనుమతిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య ప్రకటించారు. అయితే, 15 నిమిషాల ముందే ఎగ్జామ్ సెంటర్కు చేరుకునేలా ప్లాన్ చేసుకోవాలని స్టూడెంట్లకు సూచించారు. సోమవారం హైదరాబాద్లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఎగ్జామినేషన్ కంట్రోలర్ జయప్రదబాయితో కలిసి కృష్ణ ఆదిత్య పరీక్షలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 9,96,971 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వారికోసం 1,532 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఫస్టియర్ లో 4,88,448 మంది, సెకండియర్ లో 5,08,523 మంది విద్యార్థులు ఎగ్జామ్స్ రాయబోతున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 1,532 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, అంతే మొత్తంలో డిపార్ట్ మెంట్ ఆఫీసర్లను నియమించినట్టు చెప్పారు. అలాగే మొత్తం 29,992 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు ఆయన వివరించారు.

**సీసీకెమెరాల నిఘాలోనే..**

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,532 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని కృష్ణ ఆదిత్య తెలిపారు. వీటన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేసినట్లు చెప్పారు. ప్రతి 45 సెంటర్లకు ఇంటర్ బోర్డులో ఒక స్క్రీన్ ఏర్పాటు చేశామని, మొత్తంగా 31 స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు. ప్రతి ప్రశ్నాపత్రంపై యూనిక్ కోడ్ ప్రింట్ చేశామని, ఏ ప్రశ్న పత్రం ఎవరికి వెళ్తుందో ఈజీగా తెలిసిపోతుందని చెప్పారు.

**ధైర్యంగా పరీక్షలు రాయండి**

విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో, ధైర్యంగా పరీక్షలు రాయాలని కృష్ణ ఆదిత్య తెలిపారు. ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ప్రశాంతంగా ఎగ్జామ్స్ రాయాలని సూచించారు. అయితే, ఇంటర్ పరీక్షలకు టీజీపీఎస్సీ గైడ్ లైన్స్ ను అమలు చేయబోతున్నట్టు ఆయన వివరించారు. ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల పాస్ పర్సంటేజీ పెంచేందుకు ప్రత్యేక క్లాసులు, స్లిప్ టెస్టులు నిర్వహించామని, ఈ సారి ప్రభుత్వ కాలేజీల్లో పర్సంటేజీ పెరుగుతుందని ధీమా వ్యక్తంచేశారు. జవాబు పత్రాల మూల్యంకనం ఆఫ్ లైన్ లో.. మ్యాన్యువల్ పద్ధతిలోనే చేపడుతున్నట్లు తెలిపారు. ఆన్ లైన్ ఎవాల్యుయేషన్ చేయడం లేదని స్పష్టంచేశారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**చేతిరాతతోనే ఆ పరీక్షలు..**

ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఇంటర్ బోర్డు అధికారుల తీరు మారడం లేదు. విద్యార్థులు తక్కువగా ఉన్నారనే సాకుతో మరాఠీ, కన్నడ మీడియం పేపర్లను ప్రింట్ చేయించలేదు. చేతిరాతతోనే ప్రశ్నాపత్రాలను అందిస్తామని ఇంటర్ బోర్డు సెక్రెటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు. వచ్చే ఏడాది ఈ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు

# ఘనంగా ఎస్సీ సెల్ అధ్యక్షుని జన్మదిన వేడుకలు



నారాయణఖేడ్, ప్రజా స్వేచ్ఛ

నారాయణఖేడ్ తాలుక ఎస్సి సెల్ అధ్యక్షులు గైని సాయులు జన్మదిన వేడుకలను మంగళవారం ఖేడ్ లోని ఎంపి సురేష్ షేట్కార్ గృహం వద్ద ఘనంగా నిర్వహించారు.ఎంపి సోదరుడు జితేంద్రనాథ్ షేట్కార్,కాంగ్రెస్ పార్టీ యువనేత సాగర్ షేట్కార్ ల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సాయులుకు తినిపించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ,బీసీ సెల్ అధ్యక్షులు సాయిలు పటేల్,ఎస్టీ సెల్ అధ్యక్షులు నెహ్రూ నాయక్,నాగల్గిద్దా మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్ రావు పటేల్,నాయకులు నారాయణరెడ్డి, బస్వరాజ్,రహిమ్, పండరి,జ్ఞాన్ రెడ్డి, భూపాల్,బసిరెడ్డి, కృష్ణా,సురేష్ తదితరులు ఉన్నారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుభాశిస్సులు

**-మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్..**



మేడిపల్లి ,ప్రజా స్వేచ్ఛ

రేపటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే తుంగతుర్తి నియోజకవర్గం విద్యార్థిని, విద్యార్థులకు మేడ్చల్ జిల్లా బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాయాలని మీరు కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నాను అని మీ మంచి భవిష్యత్తు కి ఇది పునాది లాంటిదని పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు.అదే విధంగా మంచి ఉత్తీర్ణత సాధించి మీ తల్లి తండ్రులకు, మీ అధ్యాపకులకు మంచి పేరు తీసుకరావాలన్నారు.

# నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ**



కుత్బుల్లాపూర్ ,ప్రజా స్వేచ్ఛ

దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, సంఘం సభ్యులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని ప్రజలు విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ప్రజలందరికీ ప్రతిరోజు అందుబాటులో ఉంటానని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# చల్లా నరసింహారెడ్డి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం



ప్రజా స్వేచ్ఛ ......
రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలలో తెలంగాణ పట్టణ ఆర్థిక మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా G.O51 & AMRUT పథకాల క్రింద జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన – TUFIDC చైర్మన్ శ్రీ చల్లా నరసింహారెడ్డి గారు...

హైదరాబాద్ : తెలంగాణ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (TUDFIDC) చైర్మన్ శ్రీ చల్లా నరసింహారెడ్డి గారి అధ్యక్షతన మాసబ్ ట్యాంక్ లోని వారి కార్యాలయంలో రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలలో జరుగుతున్న అభివృద్ధి మరియు జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు... G.O.51 & AMRUT పథకాల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు, అలాగే రానున్న రోజులలో ప్రత్యక్షంగా ఫీల్డ్ విజిట్ నిర్వహించి జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక మున్సిపాలిటీలలో సంబంధిత ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించినట్టు వారు తెలిపారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్లు విశ్వనాథ్ రాజు, చిన్నారావు, వెంకటేశ్వర్లు, జ్యోతిర్మయి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (PH) విజయభాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ మహబూబ్ నగర్ సందీప్, రమణ మూర్తి పాల్గొన్నారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## 'రేషన్ కోటా పెంచండి' కేంద్రానికి సీఎం విజ్ఞప్తి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ......
కొత్త రేషన్ కార్డుల జారీ నేపథ్యంలో అవసరమైన కోటా పెంచాలని CM రేవంత్ కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి ఉత్తమ్, సీఎం.. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయ్యారు. 2014-15కి గాను సేకరించిన ధాన్యం బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు.ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యం బకాయిలు రూ.343.27 కోట్లు విడుదల,CMR డెలివరీ గడువును పొడిగించాలని కోరారు.

## ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్కా కొమురయ్య విజయాన్ని పురస్కరించుకొని చెంగిచెర్లలో సంబరాలు

### పాల్గొన్న బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఏర్పుల మహేష్



మేడిపల్లి ,ప్రజా స్వేచ్ఛ
ఉమ్మడి కరీంనగర్,నిజామాబాద్,మెదక్, అదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం సాధించిన టి పి యు ఎస్ బలపరిచిన బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య విజయాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం బోడుప్పల్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఎర్పుల మహేష్ ఆధ్వర్యంలో చెంగిచర్ల చౌరస్తా లో బాణా సంచా కాల్చి సంబురాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎలక్షన్లు బిజెపి పార్టీ ని తెలంగాణలో అధికారం తీసుకొచ్చే దిశ గా ప్రతి ఒక్క కార్యకర్త కలుపుకొని పోయి తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీని అధికారంలోకి తీసుకువస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో బోడుప్పల్ బీజేపీ ఉపాధ్యక్షులు శరత్ చంద్రారెడ్డి , యువ మోర్చ జిల్లా అధికార ప్రతినిధి బజార్ కిరణ్ గౌడ్ గారు,బొడుప్పల్ మండల ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి రాచమల్ల చంద్ర శేఖర్, బోడుప్పల్ యువ మోర్చ ప్రధాన కార్యదర్శి కలకొండ సత్యం ,సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ రెడ్డి , బూత్ అధ్యక్షులు నెల్

## ఇసుక కుప్పలను సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం



కూకట్ పల్లి, ప్రజా స్వేచ్ఛ
పరిధిలోని పర్వతనగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ని క్యాంపు కార్యాలయంలో కలవడం జరిగింది. అనేక సంవత్సరాలుగా తాము ఇసుక వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఏ నాడు కూడా ఎవరూ కూడా మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదని ఇటీవల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించిందని పోలీసులు రెవెన్యూ అధికారులు వచ్చి మా వాహనాలను ఇసుక కుప్పలను సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా వేలాది రూపాయలు ఫైన్ విధిస్తున్నారని MLA దృష్టికి తెచ్చారు. న్యాయం చేయాలని కోరుతూ ఈ మేరకు వినతి పత్రం కూడా ఇచ్చారు. ఇసుక వ్యాపారుల ఆవేదనను అర్థం చేసుకున్న ఏమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గార్లకు లేక రాసి కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టొద్దని ప్రభుత్వ ఆదేశాలపై ముందుగా ప్రజలకు చిరు వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వయం ఉపాధితో బ్రతుకుతున్న ప్రజలను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫార్మ్ ల్యాండ్ ల వల్ల అంతరించిపోతున్న వన్యప్రాణులు



నారాయణఖేడ్,మార్చ్ 4:
నారాయణఖేడ్ నియోజకవర్గానికి నలువైపులా అడవులు,కొండలు, గుట్టలు ఉండడం, మంజీరా నది ప్రవహించడం వల్ల వన్యప్రాణులు కూడ ఎక్కువగానే ఉన్నాయి. ముఖ్యంగా జింకలు, దుప్పిలు,లేడీలు, నెమళ్ళు,కుందేళ్లు గుంపులు గుంపులుగా వ్యవసాయ క్షేత్రాలు, గ్రామాల శివారులలో, అడవులలో ప్రతిరోజు దర్శనమిస్తాయి.గత కొన్ని సంవత్సరాలుగా నియోజకవర్గంలో కొండలు,గుట్టలు, పనికిరాని వ్యవసాయ భూములలో అనేక ఫార్మ్ ల్యాండులు వెలిశాయి.పలు కంపెనీల పేరుతో 10 నుండి 500 వందలకు పైగా ఎకరాల చొప్పున భూములను కొనుక్కొని వాటిని సారవంతం చేసి వందల ఎకరాల చుట్టు ముళ్ళకంచెలు వేయడం,గోడలు ఏర్పాటు చేస్తున్నారు ఫార్మ్ ల్యాండ్ యజమానులు. అంతవరకు యదేచ్ఛగా అడవులు, వ్యవసాయ భూములు,కొండలు, గుట్టలలో సంచరించిన వన్యప్రాణులు సంచరించడానికి స్వచ్ఛలేకపోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం, కొన్ని వన్యప్రాణులు త్రాగునీరు, ఆహారం దొరకక చనిపోతున్నాయి. మదర్ ఇండియా లాంటి ఫార్మ్ ల్యాండ్ యజమానులు తమ భూముల చుట్టు తిరిగే జింకలు,దుప్పీలను చూపించి భూములను విక్రయిస్తున్నారు. ముఖ్యంగా మోర్గి ఏరియాలో వందల సంఖ్యలో జింకలు ఉన్నాయి మదర్ ఇండియా ఫార్మ్ ల్యాండ్ ఏర్పాటు వల్ల వాటి మనుగడ కనుమరుగు అవుతుందని చెప్పవచ్చు.ఫార్మ్ ల్యాండ్ ల ఏర్పాటు వల్ల అభివృద్ధి ఉందొ, లేదో తెలియదు కానీ వన్యప్రాణులు మాత్రం అంతరించిపోతున్నాయి అనేది మాత్రం వాస్తవం. ఇప్పటికైనా వన్యప్రాణుల సంరక్షణ, ఆటవిశాఖ అధికారులు మరియు ప్రభుత్వం జోక్యం చేసుకొని వన్యప్రాణులు అంతరించిపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్ నేత దరువు అంజన్నకు మాతృవియోగం పరామర్శించిన పలువురు నేతలు





కుత్బుల్లాపూర్,ప్రజా స్వేచ్ఛ
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తెలంగాణ ఉద్యమ కవి గాయకులు దరువు అంజన్న మాతృమూర్తి మహాశివరాత్రి పర్వదినం రోజు శివైక్యం చెందినారాని, తెలుసుకొని పలువురు రాష్ట్ర నేతలు కళాకారులు కవులు ప్రజాసంఘాల నేతలు స్వచ్ఛంద సంస్థ నాయకులు పలు రాజకీయ పార్టీ నేతలు అంజన్నను పరామర్శించడానికి అతని స్వగృహం ద్వారకా నగర్ గాజులరామారానికి విచ్చేయడం జరిగింది, ఈ సందర్భంగా పలువురు నేతలు దరువు అంజన్న మాతృమూర్తి లలితమ్మ చేసిన సేవలను కొనియాడారు, అంజన్న తెలంగాణ ఉద్యమంలో విరోచతమైన పాత్ర ఉండడం లోపల తన తల్లి అందించినటువంటి అండదండలు ఎన్నో ఉన్నాయని ఇటువంటి గొప్ప నాయకుడిని మన సమాజానికి అందించిన ఘనత లలితమ్మకి దక్కుతుందని అన్నారు, దరువు అంజన్న వాళ్ళ స్వస్థలం మెదక్ జిల్లా ప్రస్తుత సిద్దిపేట జిల్లా రాయపోలు మండల కేంద్రం, లలితమ్మకు ఆరుగురు ఆడపిల్లలు ఒక్క కొడుకు అంజన్న, గత 24 సంవత్సరాల క్రితం భర్తను కోల్పోయిన లలితమ్మ ఎంతగానో కష్టపడి బట్టలు కుట్టి బీడీలు చేసి ఈ పేద కుటుంబాన్ని సాదుకుంటూ వచ్చింది ఇంత గొప్ప సమాజ సేవకున్ని సమాజానికి అందించినందుకు లలితమ్మకు పేరుపేరునా జోహార్లు అర్పించారు, దరువు అంజన్న అధైర్య పడవద్దు అని నీ వెనుక తెలంగాణ సమాజం యావత్ ఉందని వాళ్ళు భరోసా ఇచ్చారు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, పృధ్వి రాజ్, దరువు ఎల్లయ్య,తెలంగాణ ఉద్యమ కవి గాయకులు వరంగల్ శ్రీనివాస్,నెర్నాల కిశోర్, చక్రాల రఘు, మోహన్ బైరాగి, రాచకొండ రమేష్,బోయిని శ్రీనివాస్, బీసీ సంగం కళాకారుడు, రాజలింగం, వెంకటాచారి, అమూల్య స్టూడియోస్ అధినేత ఎర్రం వేణు, మానుకోట ప్రసాద్, యాకన్న, అంజలి, గాయకుడు రామాచారి, గాజులరామరం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సొంటి పున్నారెడ్డి, పుల్లారెడ్డి, చిరుమూర్తి రాజు,కయుమ్ బాయ్, జెస్సి, జిల్లా గణేష్,నాయకులు తెలంగాణ సాయి,ఎర్ర శ్రీనివాస్, మారోజు వీరన్న కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం నేతలు మోహన్ రెడ్డి శ్రీనివాస్ మహేష్ జోగిపేట శ్రీనివాస్ చింటూ బోయిని శ్రీనివాస్, స్థానిక నాయకులు వాసన, జానకిరామ్, వర్మ కరుణాకర్ రెడ్డి, సురేంద్రబాబు, డాక్టర్ మహేందర్, నాగభూషణం, శేఖర్, భువన్, ప్రసన్న, సునీల్, ఎంఆర్పిఎస్ నేతలు రామచందర్, డప్పు రామస్వామి, నింగి నేల మేము సైతం ఆర్గనైజేషన్ సభ్యులు అరుణ బంగారు,ప్రసన్న, ఇందిరా,ఉష, సంగీత, సమ్మన్న, మధుసూదన్ రెడ్డి, రోహిణి, సతీష్,బీసీ కళామండలి రాష్ట్ర అధ్యక్షులు బీసీ లింగం,డప్పు స్వామి నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు కిరణ్, అనువోజు వెంకన్న, ప్రవీణ్, పేరాల యాదగిరి,చిరంజీవి, అనుదీప్,స్వప్న, నర్మదా,పాట మహేష్, రాజశ్రీ,పున్న రమేష్, ఎస్ ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుల్తానా,కోశాధికారి ఉమర్, ప్రధాన కార్యదర్శి పుట్టరాజు, శశిధర్ రెడ్డి,నాగేందర్, గోపాల్ అన్న, కుత్బుల్లాపూర్ విలేకరులు నర్సింగ్, జుట్టు సాయి,ఎల్లంపల్లి నర్సింహులు,కృష్ణ, సాయిరాజ్, దుర్గాప్రసాద్,రామస్వామి, భాస్కరాచారి, కూకట్పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు గజ్వేల్ ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శించారు.

# బిజినెస్

## భారత్‌లో టెస్లా మొదటి షోరూమ్ ఇక్కడే..

### ఎలాన్ మస్క్ కీలక ఒప్పందం! అద్దె ఎంతో తెలుసా?




ముంబైలో తన మొదటి షోరూమ్ కోసం ఒప్పందాన్ని ఖరారు చేయడంతో టెస్లా భారతదేశంలో ప్రారంభించటానికి దగ్గరగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో కంపెనీకి ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, టెస్లా ముంబైలోని ప్రధాన బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ ( BKC )లో 4,000 చదరపు అడుగుల వాణిజ్య సముదాయాన్ని బుక్ చేసుకుంది.

**రూ.35 లక్షల అద్దె:**

ఈ ఫ్లాగ్‌షిప్ షోరూమ్ టెస్లా తాజా ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రదర్శిస్తుంది. టెస్లా నెలవారీ అద్దెను దాదాపు రూ.35 లక్షలు (చదరపు అడుగుకు రూ.900)గా నిర్ణయించింది. లీజు ఒప్పందం ఐదు సంవత్సరాలు. టెస్లా ఇప్పటికే ఢిల్లీలోని ఏరోసిటీ కాంప్లెక్స్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టెస్లా భారతదేశంలో తన ఉనికిని విస్తరించాలని యోచిస్తోంది. అలాగే దీని కోసం కంపెనీ ఢిల్లీ, ముంబై, పూణే వంటి నగరాల్లో అనేక ప్రాంతాలను ఎంచుకోగా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం ఆ కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటి. దీనితో పాటు టెస్లా ఢిల్లీలోని ఏరోసిటీలో తన షోరూమ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తోంది. భారతదేశంలోకి టెస్లా ప్రవేశం ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌లో పోటీని పెంచడమే కాకుండా భారతదేశ ఆటోమొబైల్ రంగానికి ఒక కొత్త విప్లవంగా కూడా నిరూపించుకోనుంది.

**ధర ఎంత ఉంటుంది?**

టెస్లా మోడల్స్ భారతదేశంలో ప్రీమియం ఆఫర్‌లుగా ఉండనున్నాయి. ధరలు దాదాపు రూ. 21 లక్షల (25,000) నుండి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## ట్రంప్ టారిఫ్ ఇక్కట్లు.. బంగారం ధరలకు రెక్కలు.. రూ.89వేల మార్క్‌కు పుత్తడి..!


అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా దేశీయ బులియన్ మార్కెట్లలో జ్యువెల్లర్లు, రిటైలర్లు, స్టాకిస్టుల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో మంగళవారం బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. ఒక్కరోజే 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1,100 వృద్ధి చెంది తిరిగి రూ.89 వేల మార్క్‌ను చేరుకుందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తెలిపింది. సోమవారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.87,900 వద్ద ముగిసింది. మరోవైపు 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1,100 పుంజుకుని రూ.88,600 పలికింది. సోమవారం 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.87,500 వద్ద స్థిర పడింది. మరోవైపు, కిలో వెండి ధర రూ.1,500 వృద్ధితో రూ.98,000లకు చేరుకుంది. సోమవారం కిలో వెండి ధర రూ.96,500 వద్ద ముగిసింది కెనడా, మెక్సికో, చైనాలపై విధించిన టారిఫ్‌లు యధాతథంగా అమల్లోకి వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ధృవీకరించడంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయని బులియన్ వ్యాపారులు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలకు ప్రతిగా యూఎస్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు పెంచుతామని చైనా, కెనడా ప్రకటించడంతో నార్త్



అమెరికా పొడవునా ఉద్రిక్తతల పెరుగుదలకు దారి తీసింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్స్ ఏప్రిల్ డెలివరీ తులం బంగారం ధర రూ.806 పుంజుకుని రూ.86,190 వద్ద స్థిర పడింది. 'కామెక్స్ గోల్డ్‌లో బంగారం ధర ఒక శాతానికి పైగా పెరిగి పాజిటివ్‌గా ఉంది. ఎంసీఎక్స్‌లో బంగారం ధర పెంచుకున్నా.. అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ స్వల్పంగా పతనమైంది. కెనడా, మెక్సికో, చైనాలపై అమెరికా దిగుమతి సుంకాలు, అమెరికాపై చైనా, కెనడా ప్రతీకార దిగుమతి సుంకాల పెంపునకు దిగాయి. ఫలితంగా ఇన్వెస్టర్ల మదుపునకు స్వర్గధామంగా నిలిచిన బంగారం ధరకు రెక్కలొచ్చాయి' అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. ఇక ఎంసీఎక్స్‌లో కిలో వెండి మే డెలివరీ ధర రూ.472 పుంజుకుని రూ.96,482 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఏప్రిల్ కాంట్రాక్ట్స్ ఔన్స్ బంగారం ధర 32.70 (1.13 శాతం) డాలర్లు పెంచుకుని 2,933.80 డాలర్లకు చేరుకుంది. ఇదిలా ఉంటే స్పాట్ గోల్డ్ ఔన్స్ బంగారం ధర ఒకశాతం పెరిగి 2,921.42 డాలర్లకు చేరుకుంది.

## మార్కెట్‌లు విలవిల.. రిలయన్స్ సహా బ్లూ చిప్ కంపెనీలకు నష్టాలు..!

కెనడా, మెక్సికో, చైనాల నుంచి దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెంచిన టారిఫ్ అమల్లోకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్లతోపాటు దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా మంగళవారం భారీగా పతనం అయ్యాయి. విదేశీ మదుపర్లు నిర్విరామంగా పెట్టుబడులు ఉపసంహరిస్తుండటంతో వరుసగా మూడోసెషన్‌లోనూ నష్టాల పాలైన బీఎస్ఈ -50 ఇండెక్స్ సెన్సెక్స్ మంగళవారం 96 పాయింట్ల పతనంతో 73 వేల పాయింట్ల దిగువన స్థిర పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 96.01 పాయింట్లు నష్టపోయి 72,989.93 పాయింట్ల వద్ద స్థిర పడింది. బీఎస్ఈ-30లో 18 స్టాక్స్ నష్టాలతో ముగిస్తే, 12 స్టాక్స్ లాభాలతో స్థిర పడ్డాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 452.4 పాయింట్ల నష్టంతో 72,633.54 పాయింట్ల కనిష్టానికి పతనమైనా ట్రేడింగ్ ముగిసే సమయానికి రికవరీ సాధించింది.



## ఫైనల్ కు దూసుకెళ్లిన భారత్


ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో దుబాయి వేదికగా జరిగిన తొలి సెమీ ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాపై నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించిన టీం ఇండియా ఫైనల్స్‌లోకి ఎంటరైంది. సౌత్ ఆఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగే మరో సెమీ ఫైనల్ మ్యాచ్ విజేతతో టీం ఇండియా ఫైనల్‌లో తల పడనున్నది. నిర్ణీత 50 ఓవర్లలో 265 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన టీం ఇండియా మరో 11 బంతులు మిగిలి ఉండగానే విజయ తీరాలకు చేరుకుంది. విజయానికి చేరువలో ఉండగా హార్దిక్ పాండ్యా ఔటయినా 49వ ఓవర్‌లో మ్యాక్స్‌వెల్ వేసిన తొలి బంతిని కేఎల్ రాహుల్ సిక్సర్‌గా మలచడంతో 267 పరుగులతో టీం ఇండియా విజయం పూర్తయింది. స్పిన్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై టీం ఇండియా బ్యాటర్లు ఆచితూచి ఆడుతూ జట్టు స్కోర్ పెంచడానికి ప్రయత్నించారు. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసి గట్టి పునాది వేసిన విరాట్ కోహ్లీ.. ఈ మ్యాచ్‌లో కూడా 84 పరుగులతో టీం విజయంలో కీలక పాత్ర పోషించారు. 45 పరుగులకే ఓపెనర్లు




రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఔటయినా, శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్‌లతో మంచి భాగస్వామ్యాలు నెలకొల్పుతూ జట్టు విజయానికి బాటలు వేశాడు. కోహ్లీ 84 పరుగుల్లో ఐదు ఫోర్లు ఉన్నాయి. కోహ్లీ తర్వాత శ్రేయాస్ అయ్యర్ 45 పరుగులు, కేఎల్ రాహుల్ 42 పరుగులతో పర్వాలేదనిపించారు. శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్, విరాట్ కోహ్లీ తర్వాత నిలకడగా ఆడుతూ హార్దిక్ పాండ్యా 28 పరుగుల వద్ద ఎల్లిస్ బౌలింగ్‌లో మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారి పట్టాడు. హార్దిక్ పాండ్యా స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రవీంద్ర జడేజాతో కలిసి కేఎల్ రాహుల్ ఫినిష్ చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్, ఆడం జంపా రెండేసి వికెట్ల చొప్పున, బెన్ డ్వార్షుయిస్, కూపర్ కొనొల్లీ చెరో వికెట్ తీశారు.

## సిరాజ్‌తో మహిరా శర్మ డేటింగ్..

టీమ్ ఇండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ చుట్టూ ఈ మధ్య కాలంలో వార్తలు ఎక్కువే విన్పిస్తున్నాయి. సినిమా రంగానికి చెందిన ఒకరిద్దరితో సిరాజ్ ప్రేమాయణం అంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. మొన్న ప్రముఖ గాయని ఆశా భోస్లే మనవరాలు..ఇవాళ బాలీవుడ్ నటి మహిరా శర్మ. ఈ మధ్య కాలంలో మొహమ్మద్ సిరాజ్ ప్రేమాయణం వార్తలు విన్పిస్తున్నాయి. ఇటీవలే ప్రముఖ గాయని ఆశా భోస్లే మనవరాలు, సింగర్ జనై భోంస్లేతో సిరాజ్ డేటింగ్ అంటూ గట్టిగానే సోషల్ మీడియా పుకార్లు లేపింది. ఈ పుకార్లు ఎంతగా వైరల్ అయ్యాయంటే అటు మొహమ్మద్ సిరాజ్, ఇటు జనై భోస్లే ఇద్దరూ స్పందించాల్సి వచ్చింది. ముంబైలో జరిగిన జనై భోస్లే పుట్టినరోజు వేడుకలకు సిరాజ్ హాజరైన ఫోటోలతో నెటిజన్లు రెచ్చిపోయారు. జనై తనకు సోదరి లాంటిదని సిరాజ్, సిరాజ్ తనకు సోదరుడని జనై ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా క్లారిటీ ఇచ్చాకే ఈ



పుకార్లకు చెక్ పడింది. ఇప్పుడు కొత్తగా మరో బాలీవుడ్ నటి మహిరా శర్మతో మోహమ్మద్ సిరాజ్ డేటింగ్ అంటూ మళ్లీ కథనాలు ప్రచారమౌతున్నాయి. మహిరా శర్మ పోస్ట్‌కు మొహమ్మద్ సిరాజ్ లైక్ కొట్టడం, ఇన్‌స్టాలో ఫాలో అవడంతో నెటిజన్లు ఎఫైర్ అంటూ మొదలెట్టేశారు. బాలీవుడ్ బ్యూటీ మహిరా శర్మతో సిరాజ్ ప్రేమలో ఉన్నాడంటూ పుకార్లు షికారు చేస్తున్నాయి. ఇద్దరూ కొద్దిరోజులుగా డేటింగ్‌లో ఉన్నారని ఈ ఇద్దరి సన్నిహితులు చెప్పారంటూ ఇంగ్లీష్ వెబ్‌సైట్ బయటపెట్టింది. ఈ వార్తలపై ఇప్పుడు మహిళా శర్మ స్పందించింది. ఈ విషయంలో చెప్పేందుకేమీ లేదని, ఎవరితో డేటింగ్ చేయడం లేదని మహిరా శర్మ తెలిపింది. ఫ్యాన్స్ ఎవరికి ఎవరితోనైనా రిలేషన్ పెట్టగలరని వ్యాఖ్యానించింది. గతంలో తాను పనిచేసిన కొందరు నటులతో కూడా ఇలానే ఎఫైర్స్ ప్రచారం చేశారని స్పష్టం చేసింది. అందుకే తాను ఇలాంటి పుకార్లను పట్టించుకోనని చెప్పుకొచ్చింది. అటు మహిరా శర్మ సైతం ఈ రూమర్లను ఖండించింది.

# స్పోర్ట్స్

## ఛేజింగ్‌లో అత్యధిక రన్స్ చేసిన ఆటగాళ్లు వీళ్లే

### టాప్-3లో ముగ్గురూ ఇండియన్సే..!




వన్డే ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్‌లలో ఛేజింగ్‌లో అత్యధిక రన్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో టాప్-3 లో ముగ్గురూ భారతీయులే ఉన్నారు. ఈ జాబితాలో 8,720 పరుగులతో అగ్రస్థానంలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కొనసాగుతున్నాడు. రన్ మెషిన్ విరాట్ కోహ్లీ ఆ తర్వాత స్థానంలో ఉన్నాడు. కోహ్లీ ఛేజింగ్‌లో 8000 పరుగుల మైలురాయిని దాటాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 8 వేల పరుగుల మైలురాయిని దాటాడు. కోహ్లీ తర్వాత 6,115 పరుగులతో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మూడో స్థానంలో కొనసాగుతున్నారు. ఆ తర్వాత స్థానాల్లో శ్రీలంక స్టార్ బ్యాటర్ సనత్ జయసూర్య (5,742 పరుగులు), దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్ (5,575 పరుగులు) ఉన్నారు.



# ఫుల్ జోష్‌లో ఊర్వశి రౌటెలా..

## అందాలతో మాయ చేస్తోందిగా..

బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌటెలా గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ ముద్దుగుమ్మ ఓ వైపు బాలీవుడ్ లో సినిమాలు చేస్తూనే మరోవైపు నార్త్‌లో స్పెషల్ సాంగ్స్‌లో చిందులేస్తూ మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంటుంది. రీసెంట్‌గా టాలీవుడ్ నటసింహం నందమూరి బాలకృష్ణ డాకు మహారాజ్ మూవీలో దబిడి దిబిడే అంటూ ఐటమ్ సాంగ్ చేసి, తన అంద చందాలతో కుర్రకారును మాయ చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీ మంచి సక్సెస్ అందుకుంది. ఇక డాకు మహారాజ్ మూవీ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, వీలున్నప్పుడాల్ల వెకేషన్స్‌కు వెళ్తూ, వరస ఫొటో షూట్‌తొ తన అభిమానులను ఎంటర్టైన్ చేస్తోంది. తాజాగా ఈ బ్యూటీ తన ఇన్ స్టాలో లేటెస్ట్ ఫొటోస్ షేర్ చేసింది. అందులో ఈ ముద్దుగుమ్మ సాంగ్స్ పాడుతున్నట్లు కనిపిస్తుంది. ఇక ఈ ఫొటోలో ఈ బ్యూటీని చూడటానికి రెండు కళ్లు చాలవు. బ్రౌన్ కలర్ డ్రెస్‌లో, చాలా బ్యూటిఫుల్‌గా కనిపించింది. అంతే కాకుండా ఇందులో ఈ అమ్మడు చాలా యాక్టివ్‌గా కనిపిస్తుంది. దీంతో ఊర్వశి ఫుల్ జోష్‌లో ఉంది, బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. తమ అభిమానులు.

# శ్రీలీల సినిమాలో డేవిడ్ వార్నర్..

## ఏ మూవీ అంటే..




ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ గురించి చాలా మందికి తెలుసు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఉన్నప్పుడు తెలుగు పాటలకు డ్యాన్స్ చేస్తూ, రీల్స్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు. అలాగే గతంలో అనేక ప్రకటనలలో కనిపించాడు. ఇప్పుడు తెలుగు సినిమాలో నటించేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు సంబంధించిన అధికారికంగా ప్రకటించారు మేకర్స్. మైత్రి మూవీ మేకర్స్ అనేక సూపర్ హిట్ చిత్రాలను అందించింది. ఇప్పుడు డేవిడ్ వార్నర్ సైతం ఈ సంస్థ నిర్మిస్తున్న సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సంస్థ నిర్మాతలలో ఒకరైన రవిశంకర్ ఒక ప్రెస్ మీట్ లో ఈ విషయం చెప్పారు. ఈ సంస్థ నిర్మిస్తున్న 'రాబిన్ హుడ్' చిత్రంలో డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలో కనిపించారు. దీంతో ఈ చిత్రంలో రాబిన్ హుడ్ సినిమాలో ఆయన పాత్ర ఎలా ఉంటుందో అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అభిమానులు కూడా అతన్ని పెద్ద తెరపై చూడటానికి ఎదురు చూస్తున్నారు. డేవిడ్ వార్నర్ వ్యక్తిత్వం భిన్నంగా ఉంటుంది. ఆయనకు తెలుగు ప్రేక్షకులతో మంచి అనుబంధం ఉంది కాబట్టి, ఆయనను మరింతగా ఇష్టపడే అవకాశం ఉంది. 'రాబిన్ హుడ్' చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ కంప్లీట్ అయ్యింది. డేవిడ్ వార్నర్ తరఫున షూటింగ్ రహస్యంగా జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో నితిన్, శ్రీలీల జంటగా నటిస్తుండగా.. ఈ చిత్రానికి వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నారు. 2025 IPL లో డేవిడ్ వార్నర్ కోనుగోలు కాలేదు. అతని బేస్ ప్రైస్ రూ. 2 కోట్లు. 2024 టీ20 ప్రపంచ కప్ నుంచి నిష్క్రమించిన తర్వాత వార్నర్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు.

# 15 ఏళ్ల సినీ ప్రయాణం పూర్తి చేసుకున్న సమంత..




టాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ సమంత గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. స్టార్ హీరోయిన్‌గా ఓ రేంజ్‌లో పాపులారిటీ సంపాదించుకున్న ఈ భామ ఆ తర్వాత నాగ చైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకుంది. సంసారం సజావుగా సాగుతున్న సమయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి అతని నుండి విడిపోయింది. ఇక ప్రస్తుతం సింగిల్‌గా ఉంటుంది. ఇక చైతూ నుండి విడిపోయిన తర్వాత సమంతకి మయోసైటిస్ అనే వ్యాధి బయటపడింది. చాలా రోజుల పాటు ఈ వ్యాధితో బాధపడ్డ సమంత సినిమాలకి కూడా బ్రేక్ ఇచ్చింది. అయితే చివరికి ఆ వ్యాధితో ధీటుగా ఎదుర్కొని మళ్లీ సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతుంది. అయితే సమంత సినిమాల్లోకి వచ్చి 15 ఏళ్లు పూర్తయ్యాయి. 2010లో విడుదలైన ఏ మాయ చేసావే సినిమా ద్వారా సమంత ఆరంగేట్రం చేసింది. ఈ మూవీ ఫిబ్రవరి 26,2010న విడుదలై పెద్ద విజయం సాధించింది. ఈ సినిమాలో సమంతతో చైతూ జంటగా నటించాడు. ఈ మూవీ సమయంలోనే వారిద్దరి మధ్య ప్రేమ పుట్టిందని టాక్. అయితే ఏ మాయ చేశావే సినిమా విడుదలై 15 ఏళ్లు కావడంతో, సమంత సినీ జర్నీ కూడా 15 ఏళ్లు పూర్తి అయింది. ఈ సినీ ప్రయాణంలో సమంత.. అల్లు అర్జున్, ఎన్టీఆర్, పవన్ , మహేష్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోల సరసన నటించి అలరించిఆంది. తమిళంలో కూడా వరుస సినిమాలు చేసింది. చివరిగా సమంత తెలుగులో ఖుషి, తమిళంలో కాతువాక్కుల రెండు కాదల్ సినిమాల్లో నటించింది. ఈ సినిమాల తరువాత సమంత జీవితంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. విడాకులు, మయోసైటిస్ వ్యాధి , తండ్రి చనిపోవడం ఇలా సమంతని అనేక సమస్యలు చాలా ఇబ్బంది పెట్టాయి. ఇప్పుడిప్పుడే వాటి నుండి బయటపడుతున్న సమంత.. మా ఇంటి బంగారం అనే తెలుగు సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా ద్వారా నిర్మాతగా కూడా పరిచయం కానుంది. ఈ క్రమంలోనే సమంత సినీ రంగంలోకి వచ్చి 15 ఏళ్లు పూర్తి కావడంతో తన ఇన్ స్టాగ్రామ్ లో ఫోటోలను పంచుకుంటూ కృతజ్ఞతలు తెలిపింది. జీవితంలో ఎన్నో సవాళ్లని ఎదుర్కొన్న సమంత ఎంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది





# టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న 'దబాంగ్' బ్యూటీ

హిట్టు, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు సుధీర్ బాబు . గతేడాది హరోంహర, మా నాన్న సూపర్ హీరో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇవి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసితో ప్రస్తుతం జటాధర అనే సినిమా చేస్తున్నాడు. మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకి వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తుండగా.. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాతో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మార్చి 08 నుంచి సోనాక్షి జటాధర షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవలే హీరమండి: డైమండ్ బజార్ అనే వెబ్ సిరీస్‌తో వచ్చి సూపర్ హిట్ అందుకుంది సోనాక్షి.

# క్యూట్ లుక్‌లో అనన్య నాగళ్ల



యంగ్ బ్యూటీ అనన్య నాగళ్ల గురించి స్పెషల్ గా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు వకీల్ సాబ్ మూవీతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మూవీలో చాన్స్ కొట్టేసి, స్టార్ స్టేస్ అందుకుంది. దీంతో అందరూ అనన్య కెరీర్ సెట్ అయినట్లే అనుకున్నారు. కానీ ఈ అమ్మడు ఆ మూవీ తర్వాత పొట్టేల్, తంత్ర, శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్, డార్లింగ్ వంటి పలు సినిమాల్లో నటించింది. కానీ అనుకున్న స్థాయిలో గుర్తింపు రాలేదు. మరీ ముఖ్యంగా ఈ ముద్దుగుమ్మకు వకీల్ సాబ్ తర్వాత స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు వస్తాయనుకున్నారు. కానీ అలాంటి ఆఫర్స్ ఏవీ ఈ ముద్దుగుమ్మకు రాలేదు. దీంతో చిన్న చిన్న సినిమాల్లో నటిస్తూ వస్తుంది. ఇక ఎప్పటికీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ. ఎప్పటికప్పుడు తన వరస ఫొటో షూట్‌తో కుర్రకారును ఆకట్టుకుంటుంది. తాజాగా అనన్య నాగళ్ల వైట్ అండ్ బ్లాక్ కలర్ ట్రెండీ డ్రెస్‌లో ఉన్న క్యూట్ ఫొటోస్‌ను తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేసింది. ఇందులో ఈ ముద్దుగుమ్మ చాలా స్టైలిష్‌గా క్యూట్‌గా కనిపిస్తుంది. దీంతో తన అభిమానులు, క్యూట్, బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మరి మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓలుక్ వేయండి.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492